సాక్షి కామారెడ్డి

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



అభివృద్ధికి కృషి
పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు.

- IIలో ▸



ప్రజావేదిక
రామారెడ్డిలోని రైతు వేదికలో శనివారం ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు.

- IIIలో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.9 /18.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురిసే అవకాశాలున్నాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నియోజకవర్గ అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు

కామారెడ్డి టౌన్: నియోజకవర్గ అభివృద్ధికి రూ. 15 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపగా రూ. 5 కోట్లు మంజూరు చేసిందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. మిగతా నిధులు తర్వలోనే మంజూరు చేస్తానని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారన్నారు. మంత్రికి ఎమ్మెల్యే ఒక ప్రకటన ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

'సన్న వడ్లలో దొడ్డు రకం కలపొద్దు'



సదాశివనగర్ : సన్నరకం వడ్లలో దొడ్డు రకం వడ్లను కలపకూడదని జిల్లా సహకార అధికారి రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో ధాన్యం సేకరణపై విండో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత ఏఈవో, ఏవో ధ్రువీకరించిన తర్వాతే వడ్లను తూకం వేసి మిల్లులకు పంపించాలన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ సదాశివరెడ్డి, మానిటరింగ్ అధికారి సాయిలు, సూపరింటెండెంట్ ప్రశాంత్, సీఈవో భైరయ్య, వైస్ చైర్మన్ పశుపతి, డైరెక్టర్లు నారాయణరెడ్డి, రాములు, ప్రవీణ్‌రెడ్డి, రాజేందర్, విండో సిబ్బంది లింగమూర్తి, నవీన్, గంగారాజు, భైరేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: నిజామాబాద్ జిల్లా పెర్కిట్‌లోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ –మహిళలు (ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఎఫ్) కోర్సులో రెండేళ్ల శిక్షణ ఇవ్వనున్నారు. ఇంటర్ పూర్తి చేసిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 35 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ మహిళలనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం అధికారి పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 29 వరకు అవకాశం ఉందని తెలిపారు. ఇతర వివరాలకు 83094 63939, 94403 55435, 83329 49550, 87902 00180, 87909 40461 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'నీటిని పొదుపుగా వాడుకోవాలి'



కామారెడ్డి క్రైం: నీటిని పొదుపుగా వాడుకోవాలని భూగర్భ జల శాఖ ఏడీ సతీశ్ యాదవ్ ప్రజలను కోరారు. కామారెడ్డి మండల సమాఖ్య భవనంలో భూగర్భ జలాల వినియోగంపై మహిళలకు అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం నీటిని వృథా చేయకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. జల సంరక్షణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నీటి సంరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, ఎంపీడీవో నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలి'



దోమకొండ: వైద్యులు సమయపాలన పాటించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని 30 పడకల క్లస్టర్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. దోమకొండ సీహెచ్‌సీ త్వరలోనే 100 పడకల ఆస్పత్రిగా మారనుందన్నారు. అజయ్‌కుమార్‌ను మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ సన్మానించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్యులు శ్రీవాణి, వైష్ణవి, దివ్య ఉన్నారు.





సండే స్పెషల్

అధికార గృహానికి ఆధునిక హంగులు!



టెర్రస్‌పైన..

- ■ విల్లాను తలపించేలా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం
- ■ కుటుంబ సమేతంగా అక్కడే నివాసముంటున్న కేవీఆర్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి రూటే సపరేటు.. అసెంబ్లీ ఎన్నికలలో ఇద్దరు సీఎం అభ్యర్థులను ఒకేసారి ఓడించి జెయింట్ కిల్లర్‌గా ఆవిర్భవించిన ఆయన.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ను ఆదర్శంగా తీసుకుని పంచెకట్టుతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఆయన వ్యవహార శైలి కూడా భిన్నంగా ఉంటుంది. అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపంపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తారు. ప్రొటోకాల్ పాటించని అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసి సమయపాలన పాటించనివారికి వార్నింగ్‌లు ఇస్తారు. హాస్టళ్లు, గురుకులాలకు వెళ్లి భోజనం నాణ్యతను పరిశీలిస్తారు. ఎన్నికలకు ముందు రూ.150 కోట్లతో సొంత మేనిఫెస్టోను ప్రకటించి ప్రజల వద్దకు వెళ్లిన ఆయన.. దాన్ని అమలు చేయడం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ముఖ్యంగా ధాన్యం ఆరబెట్టేందుకు ఊరూరా కల్లాలు నిర్మిస్తానన్న ఆయన.. ఇప్పటికే రైతులతో సమావేశాలు నిర్వహించి స్థలాలను ఎంపిక చేశారు. కల్లాలు నిర్మించేందుకు సొంతంగా రెడీమిక్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఐదేళ్లలో తానిచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి తీరుతానని పేర్కొంటున్నారు.



ప్రజలు కూర్చునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన షెడ్డు

సొంతింటిని కూల్చివేయించి..

పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు కోసం దగ్గరుండి సొంత ఇంటినే కూల్చివేయించిన కేవీఆర్.. కుటుంబ సమేతంగా క్యాంపు కార్యాలయానికి మకాం మార్చారు. అక్కడే ఉంటూ అధికార గృహానికి ఆధునిక హంగులు అద్దారు. విల్లాను తలపించేలా క్యాంపు కార్యాలయాన్ని తీర్చిదిద్దారు. అప్పట్లో ప్రభుత్వం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను గ్రౌండ్ ఫ్లోర్‌లో కార్యాలయం, ఫస్ట్ ఫ్లోర్‌లో నివాసం ఉండడానికి అనుకూలంగా నిర్మించింది. అయితే తన వద్దకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్న ఉద్దేశంతో కేవీఆర్ క్యాంపు కార్యాలయం కంపౌండ్ లోపల షెడ్లు నిర్మించారు. షెడ్ల చుట్టూరా రకరకాల మొక్కలతో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించారు. ప్రాంగణంలో కుండీల్లో రకరకాల చెట్లు పెంచుతున్నారు. పోర్టికో, లాన్, టెర్రస్‌పైనా రకరకాల చెట్లున్నాయి. కార్యకర్తలు, ప్రజలతో సమావేశం కోసం క్యాంపు కార్యాలయం పైభాగంలో షెడ్ వేయించారు. అలాగే ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం జిమ్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. పైఅంతస్తులకు వెళ్లడానికి అనుకూలంగా లిఫ్ట్, క్యాంపు కార్యాలయంలో తాగునీటి కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. విజిటర్స్ హాల్‌లో, తన కార్యాలయంలో ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఫొటోలను ఏర్పాటు చేయించారు. ''మనసు ప్రశాంతంగా ఉండాలంటే మన ఇల్లు, పరిసరాలు బాగుండాలి. మన దగ్గరకు వచ్చిన వాళ్లు కూడా ఇక్కడి వాతావరణాన్ని చూసి ఓపికగా సమస్యను చెప్పుకునే పరిస్థితి ఉండాలి. అందుకే నాకు నచ్చిన విధంగా క్యాంపు కార్యాలయాన్ని తీర్చిదిద్దాను'' అని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి 'సాక్షి'తో పేర్కొన్నారు.

మొదటి అంతస్తులో ఆహ్లాదాన్ని ఇస్తున్న మొక్కలు



ఎమ్మెల్యే కార్యాలయంలో..



'అమరవీరుల త్యాగాలు మరువలేనివి'

కామారెడ్డి క్రైం: అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్పీ సింధుశర్మ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియంలో శనివారం షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఓపెన్ కేటగిరి పురుషుల డబుల్స్ విభాగంలో 43 జట్లు, వెటరన్స్ విభాగంలో 16 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వర్ రావు, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ జార్జ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో ఎస్పీ సింధుశర్మ

ఇబ్బందులు కలగకుండా సేవలందించాలి

- డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయంలోకి రావొద్దు
- లైసెన్స్ లేకుండా స్టాంపులు విక్రయిస్తే చర్యలు
- రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ రమేశ్‌రెడ్డి



కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న డీఐజీ రమేశ్‌రెడ్డి

కామారెడ్డి టౌన్ : రిజిస్ట్రేషన్‌లకోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని రిజిస్ట్రేషన్ శాఖ నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ) రమేశ్‌రెడ్డి ఆదేశించారు. పాత రాజంపేట వద్ద గల కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ సాయికృష్ణతో మాట్లాడి రిజిస్ట్రేషన్‌లు, స్టాంపుల విక్రయాలు, సమస్యలను తెలుసుకున్నారు. ఇక్కడ సమస్యలున్నాయా.. సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారా.. డబ్బులు ఏమైనా అడుగుతున్నారా? అని కార్యాలయానికి వచ్చిన వారిని అడిగారు. అయితే వారంతా డాక్యుమెంట్ రైటర్లు అని తెలవడంతో సబ్‌రిజిస్ట్రార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్యుమెంట్ రైటర్లు, ప్రైవేట్ వ్యక్తులకు కార్యాలయంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. వారిని కార్యాలయం లోనికి రానివ్వవద్దని సబ్ రిజిస్ట్రార్‌కు సూచించారు. ప్రజలు నేరుగా కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో స్టాంపు పేపర్లు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఎవరు పడితే వారు స్టాంప్ పేపర్లు విక్రయించడానికి వీలులేదన్నారు. అలాగే వాటిపై అదనపు రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి ఇచ్చిన చోట కాకుండా, లైసెన్స్ లేకుండా స్టాంపులు విక్రయిస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో కనిపించే అడ్రసుల వద్దే స్టాంపులు విక్రయించాలన్నారు. ఫ్రాంకింగ్ మిషిన్‌లో ఇంక్ లేక సేవలు నిలిచిపోయిన విషయమై 'సాక్షి'లో ఈనెల 22న ప్రచురితమైన కథనంపైనా ఆయన స్పందించారు. ఇకపై కార్యాలయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాత బదిలీ అయ్యారు. కొత్తగూడెం జిల్లా పాల్వంచ బల్దియాకు బదిలీ చేస్తూ సీడీఎంఏ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఈ ఏడాది ఫిబ్రవరి 15న కామారెడ్డిలో విధుల్లో చేరారు. విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరిస్తారని, వివాదరహితురాలని పేరు తెచ్చుకున్నారు. అయితే వచ్చిన 8 నెలల్లోనే బదిలీ కావడం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. ఆమె బదిలీ వెనుక రాజకీయ కోణం ఉండవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. కామారెడ్డి బల్దియాకు ఇంకా ఎవరినీ కమిషనర్‌గా నియమించలేదు. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన దేవేందర్ మళ్లీ రావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఏటీసీతో ఉపాధి అవకాశాలు మెరుగు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ఐటీఐ కళాశాల సందర్శన



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

బిచ్కుంద: బిచ్కుంద ఐటీఐ కళాశాలలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ద్వారా ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. శనివారం ఆయన బిచ్కుంద ఐటీఐ కళాశాలలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను పరిశీలించారు. ప్రిన్సిపల్ ప్రమోద్ కుమార్‌తో మాట్లాడి నూతన గదుల పనులు, అడ్మిషన్ల ప్రక్రియ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐలో కొత్త కోర్సులు వచ్చాయని, విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కోర్సులపై చుట్టుపక్కల మండలాలలోనూ విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై అవగాహన కల్పించాలని సూచించారు. ఏటీసీలో అడ్మిషన్లు పొందడానికి ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అన్ని కోర్సులలో సీట్లు భర్తీ అయ్యేలా చూడాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు కోర్సులలో..

కామారెడ్డి అర్బన్: బిచ్కుందలోని ఏటీసీలో ఆరు కోర్సులలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సంగ్వాన్ తెలిపారు. మ్యాన్‌ఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ (ఏడాది కోర్సు, 40 సీట్లు) ఇండస్ట్రీ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ (ఏడాది కోర్సు, 40 సీట్లు) ఆర్టిజన్ యూజ్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ (ఏడాది కోర్సు, 40 సీట్లు), బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైడ్ మెకానికల్ (రెండేళ్ల కోర్సు, 24సీట్లు), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్ (రెండేళ్ల కోర్సు, 24 సీట్లు), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ (రెండేళ్ల కోర్సు, 24 సీట్లు) కోర్సులలో ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సు పూర్తి చేసిన వారికి టాటా కంపెనీ ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98667 57695, 96402 28856 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కారులో స్కానింగ్ యంత్రం తరలింపు

- సీజ్ చేసిన వైద్యాధికారులు
- ఆస్పత్రి పక్క భవనంలో మరో యంత్రం పట్టివేత
- ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు



వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, వైద్యాధికారులు, పోలీసులు



ఓ ఇంట్లో దాచి ఉంచిన స్కానింగ్ యూనిట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో మళ్లీ లింగ నిర్ధారణ పరీక్షల వ్యవహారం కలకలం రేపింది. రాజంపేట మండల కేంద్రంలో లింగ నిర్ధారణ చేస్తున్న వ్యక్తితో పాటు ముఠాను, మినీ స్కానింగ్ యంత్రాన్ని పట్టుకున్న ఘటన మరువక ముందే మరో ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రి నుంచి స్కానింగ్ మిషన్‌ను కారులో వేరే ప్రాంతానికి తరలిస్తున్నారని పట్టణ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అశోక్‌నగర్ కాలనీ రైల్వే గేటు వద్ద కారును ఆపి తనిఖీ చేయగా.. స్కానింగ్ యంత్రం కనిపించింది. వారు వైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి అనురాధ సంఘటన స్థలానికి చేరుకుని కారు డ్రైవర్ దేవని పృథ్వీతో పాటు మరో వ్యక్తి సిద్ధిరాములును విచారించారు. శ్రీరాంనగర్ కాలనీలో గతంలో సీజ్ చేసిన ఆస్పత్రి పక్కనే ఉన్న భవనంలోని మొదటి అంతస్తులో లింగ నిర్ధారణకు వినియోగించిన మరో స్కానింగ్ యంత్రం ఉందని వారు చెప్పడంతో అధికారులు అక్కడికి వెళ్లి యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. గతంలోనే సీజ్ చేసిన ఈ యంత్రాన్ని మళ్లీ వినియోగించడంతో అధికారులు చూసి అవాక్కయ్యారు. రాత్రి 2 గంటల వరకు అధికారుల విచారణ కొనసాగింది. స్కానింగ్‌కు సంబంధించి సిద్ధిరాములుపై ఇప్పటికే రెండుసార్లు కేసులు నమోదయ్యాయి. ఆయన బెయిల్‌పై వచ్చి షరా మామూలుగా అదే దందా నడిపిస్తుండడం గమనార్హం. సిద్ధిరాములుతో పాటు డ్రైవర్ పృథ్వీపై పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. శనివారం కోర్టులో న్యాయమూర్తి ముందు కేసు వివరాలను సమర్పించామన్నారు. సోమవారం విచారణ జరిపి పూర్తి నివేదికలను కోర్టుకు సమర్పిస్తామన్నారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాలనుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి 12,754 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5,800 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మి కాలువ ద్వారా 150, వరద కాలువ ద్వారా 5 వేలు, ఆవిరి రూపంలో 571 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉందన్నారు.

తెయూ వీసీకి సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ నూతన వైస్ ఛాన్స్‌లర్‌గా నియమితులైన ప్రొఫెసర్ టీ యాదగిరిరావును వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పంచరెడ్డి చరణ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీని ఘనంగా సన్మానించి వర్సిటీలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి, తెలంగాణ విద్యార్థి వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్‌సింగ్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

నాటు తుపాకీ కలిగి ఉన్న వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డి: నాటు తుపాకీ కలిగి ఉన్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో రాణాప్రతాప్ అనే వ్యక్తి నాటు తుపాకీతో కోతులు, పందులను హతమారుస్తున్నాడనే సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు అతడి వద్ద నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నారన్నారు. తమకు ఫిర్యాదు చేయంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

'మార్పు' శిక్షణలో టీచర్లు



నిజామాబాద్‌అర్బన్: పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ఏర్పాటు, డ్రగ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 'మార్పు' శిక్షణ కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్‌తోపాటు పలు మండలాల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. నాట్కో డైరెక్టర్ సందీప్ సుల్తానియా చేతుల మీదుగా జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, ఎంఈవోలు జీవన్, సాయిరెడ్డి, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గంగాధర్ తదితరులు ధ్రువీకరణపత్రాలు అందుకున్నారు.


రాష్ట్రపతి నిలయం సందర్శన



నిజామాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయాన్ని గిరిరాజ్ కళాశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. ఎన్ఎస్ఎస్, యువ టూరిజం ఆధ్వర్యంలో యాత్ర చేపట్టారు. నాలెడ్జిపార్క్, సెంట్రల్ బిల్డింగ్, కిచెన్, టన్నెల్, హెర్బల్ పార్క్, రాక్ గార్డెన్‌ను సందర్శించారు.

యుగపురుషుడు

- హైందవ శంఖారావంగా నిలిచిన కేశవ బలిరాం పంత్ హెడ్గేవార్
- రెంజల్ మండలం కందకుర్తిలో ఆయన వంశ మూలాలు
- కందకుర్తి మట్టిని తాకేందుకు యేటా అనేకమంది రాక
- కందకుర్తిని సందర్శించిన ప్రతి సర్‌సంఘ్‌చాలక్
- హెడ్గేవార్ వంశంలో పుట్టడం గర్వకారణం
- హెడ్గేవార్ వంశస్తుడు దిలీప్ శాస్త్రితో 'సాక్షి' ఇంటర్వ్యూ



నాటి శ్రీ క్షేత్రంగా వర్ధిల్లిన నేటి కందకుర్తి మూలాలు కలిగిన ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు కేశవ బలిరాం పంత్ హెడ్గేవార్ యుగపురుషుడని ఆయన వంశస్తుడు దిలీప్‌శాస్త్రి హెడ్గేవార్ అన్నారు. ప్రస్తుతం ఈ ప్రపంచంలో హెడ్గేవార్ వంశానికి చెందిన ఒకే ఒక్క కుటుంబం ఇందూరులో నివసిస్తోంది. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100వ సంవత్సరం నడుస్తున్న నేపథ్యంలో సదరు కుటుంబానికి చెందిన దిలీప్ శాస్త్రి హెడ్గేవార్‌తో 'సాక్షి' ముఖాముఖి ఆయన మాటల్లోనే..

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

సండే స్పెషల్



దిలీప్ శాస్త్రి హెడ్గేవార్

■ మా వంశానికి మూల పురుషుడు వల్లభేష్. దత్తాత్రేయ స్వామి అంశతో ఆయన జన్మించినట్లు మా తాతముత్తాతలు చెప్పేవారు. కందకుర్తి అప్పట్లో శ్రీ క్షేత్రంగా వర్ధిల్లింది. అప్పట్లో నృసింహ సరస్వతి స్వామి (గాణుగాపూర్–కర్ణాటక) కందకుర్తిలో మా వంశీయుల ఇంటికి వచ్చి భోజనం చేసినట్లు చరిత్ర చెబుతోంది. ఇదే క్రమంలో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించిన కేశవ బలిరాం పంత్ హెడ్గేవార్ దత్తాంశతో జన్మించినట్లు మా తాతలు చెప్పారు. అనేక మంది దీన్ని విశ్వసిస్తున్నారు. దీంతో కాషాయ జెండాను మాత్రమే గురువుగా ఉంచి ఆర్ఎస్ఎస్‌కు పురుడు పోశారు. తద్వారా హైందవ శంఖారావంగా నిలిచారు. దీంతో కేశవ బలిరాం పంత్ హెడ్గేవార్ యుగపురుషుడుగా వర్ధిల్లుతున్నారు.

■ హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా కేబీ హెడ్గేవార్ పరితపించేవారు. 1889 ఏప్రిల్ 1న ఉగాది రోజున నాగ్‌పూర్‌లో జన్మించిన హెడ్గేవార్ డాక్టరు విద్యనభ్యసించి నాగ్‌పూర్‌లో వైద్యసేవలు అందించారు. 1920లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. విధానాలు నచ్చక 1923లో కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారు. భారత స్వయంసేవక్ మండల్‌లో పనిచేశారు. 1925లో ఈ సంస్థ నుంచి బయటకు వచ్చి విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారు. ఆర్ఎస్ఎస్ నేడు ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండడం గర్వంగా ఉంది.

■ వంశవృక్షానికి సంబంధించి చూస్తే కేబీ హెడ్గేవార్ తాతగారు నాగ్‌పూర్‌కు వలస వెళ్లినప్పటికీ మా మరో ముత్తాతగారైన శ్రీరామశాస్త్రి హెడ్గేవార్ కందకుర్తిలోనే ఉంటూ వచ్చారు. ఆయన కుమారుడు బాపు శాస్త్రి హెడ్గేవార్ పిల్లలకు వేదాలు నేర్పించేవారు. ఆయన కుమారుడు వెంకటేష్ శాస్త్రి హెడ్గేవార్ మాత్రం అప్పటి సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి పిలుపు మేరకు ఇందూరుకు న్యాయాధికారిగా వచ్చారు. వెంకటేష్ శాస్త్రి కుమారుడైన మా తండ్రిగారు శ్రీరాంశాస్త్రి ఆర్మీలో పనిచేశారు. తరువాత ఇందూరు కోర్టులో పనిచేశారు. తెలుగు, మరాఠీ, హిందీ, ఆంగ్లం, ఉర్దూ తెలిసిన ఈయన ఇందూరులో టైప్ ఇన్‌స్టిట్యూట్ పెట్టి తర్జుమా చేసే సేవలు అందించారు.

కందకుర్తికి పలుమార్లు..

నాగ్‌పూర్‌లో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించినప్పటికీ హెడ్గేవార్ అనేక సార్లు కందకుర్తికి వచ్చారు. కేబీ హెడ్గేవార్‌కు కందకుర్తి మూలాలు ఉండడంతో ప్రస్తుతం అనేకమంది ఇక్కడి మట్టిని తాకేందుకు వస్తున్నారు.

■ ప్రస్తుతం కందకుర్తిలో మా ఇంటిని కేబీ హెడ్గేవార్ స్మృతి మందిరం ఏర్పాటు చేసేందుకు ఇచ్చాం. హెడ్గేవార్‌జీ మూలాలు తెలంగాణ రాష్ట్రానివి కావడం గర్వకారణం. కందకుర్తి మట్టిని తాకేందుకు అనేకమంది వస్తుండడం, ఇందులో ప్రతి సర్‌సంఘ్‌చాలక్ ఉండడం గర్వకారణంగా భావించాలి. ధర్మాబాద్ రైల్వే స్టేషన్‌కు కేబీ హెడ్గేవార్ పేరును పెట్టాలనే డిమాండ్లు ఉన్నాయి.

పురాణాల్లో గరుత్మంతుడి మాదిరిగా భరతమాతను సమున్నత స్థాయిలో ఉంచే లక్ష్యంతో సంఘ్‌ను నెలకొల్పారు. 1930లో బ్రిటిష్ చట్టాలను ఉల్లంఘించారు. నిరాహారదీక్ష చేసి 9 నెలలు కారాగారంలో ఉన్నారు. జైల్లో ఉండి కూడా సంఘ్ కార్యకలాపాల విస్తరణ కోసం కృషి చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం బలమైన పునాదులు వేశారు. త్రివేణి సంగమమైన కందకుర్తి మూలాల నుంచి భారతజాతిని సంఘటితం చేసేందుకు తిరుగులేని కృషి చేశారు. 1940 జూన్ 21న మరణించారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్: పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు గోల్ బంగ్లా వద్ద పర్యాటక ప్రాంత అభివృద్ధి కోసం ఎంపిక చేసిన 5.5 ఎకరాల స్థలాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంసాగర్ ప్రాజెక్టు గుల్ దస్తా, గోల్ బంగ్లా ప్రాంతాలు పర్యటకానికి అనువుగా ఉన్నాయన్నారు. నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులతోపాటు కౌలాస్ కోటలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా టూరిజం శాఖ అసిస్టెంట్ మేనేజర్ వైఆర్‌కే రాజు, తహసీల్దార్ భిక్షపతి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు



తెయూలో కబడ్డీ సెలక్షన్స్..

రాజంపేట: మండలంలోని తలమడ్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఆర్ గిల్షన్ ఎస్‌జీఎఫ్ అండర్ – 17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కాగా రంగా శ్రీనిధి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం దొమ్మాటి భిక్షపతి తెలిపారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు గోదావరిఖనిలో, కబడ్డీ పోటీలు నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు గిల్షన్, శ్రీనిధితోపాటు వ్యాయాయ ఉపాధ్యాయుడు బాలయ్యను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు భగత్, చక్రపాణి, దయాకర్, ఆంజనేయులు, జి నారాయణ, ప్రభాకర్, ఎస్ నారాయణ, వనిద్ర, నర్సింహారెడ్డి, అనిత, నర్సింలు, రజిత అభినందించారు.

వర్సిటీ ఇంటర్ కాలేజీ (మెన్స్) కబడ్డీ జట్టు..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ కబడ్డీ (మెన్) సెలెక్షన్స్ శనివారం క్యాంపస్ క్రీడా మైదానంలో నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల నుంచి సుమారు 50 మందికిపైగా విద్యార్థులు ఎంపిక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, పీఆర్వో పున్నయ్య, చీఫ్ వార్డెన్ మహేందర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ, క్రీడానైపుణ్యం కలిగిన 16 మంది ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ డైరెక్టర్ జి బాలకిషన్ తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెల 29 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు చెన్నైలో నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నీలో పాల్గొంటుందని ఆయన తెలిపారు. ఎంపిక పోటీల్లో ఫిజికల్ డైరెక్టర్లు బాలమణి, కుమారస్వామి, ప్రశాంత్, బుచ్చన్న, వివిధ కళాశాలల ఇన్‌చార్జీలు, క్రీడాకారులు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ బీఆర్ నేత తెలిపారు.

సగం చేప పిల్లలే సరఫరా

- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ : మత్స్యకారులకు ఉచితంగా సరఫరా చేసే చేపపిల్లల్లో ప్రభుత్వం కోత పెట్టిందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం బాల్కొండ మండలం నాగాపూర్ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఆయన చేప పిల్లలను విడుదల చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్సారెస్పీలో 62 లక్షల చేప పిల్లలను వదిలే వారన్నారు. ప్రస్తుతం 31 లక్షల చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేశారన్నారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుత సంవత్సరం రొయ్యల సీడ్‌ను వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా 4.72 కోట్ల చేప పిల్లలను వదలగా ప్రస్తుతం సగం కూ డా వదిలే పరిస్థితి లేదన్నారు. చేపపిల్లల్లో కో త విధించి మత్స్యకారుల పొట్ట కొట్టవద్ద న్నారు. ఏడీ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

బైక్ అదుపుతప్పిన ఘటనలో గాయపడిన వ్యక్తి..

మాక్లూర్ : బైక్ అదుపు తప్పిన ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 20న ఎడపల్లి మండలం జానకంపేట గ్రామానికి చెందిన సయ్యద్ ఫిరోజ్, సయ్యద్ మౌలానా బైక్ వెళ్తుండగా రామచంద్రాపల్లి శివారులో అదుపుతప్పింది. ఈ ఘటనలో సయ్యద్ మౌలానా తలకు బలమైన గాయాలుకాగా, ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య సలీమా బీ ఫిర్యాదు మేరకు బైక్ నడిపిన సయ్యద్ ఫిరోజ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బట్టలు ఉతికేందుకు వెళ్లి వృద్ధురాలు..

మాక్లూర్ : బట్టలు ఉతికేందుకు చెరువుకు వెళ్లిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన కల్లెడిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మోతె గంగుబాయి (90) బట్టలు ఉతికేందుకు శుక్రవారం సాయంత్రం చెరువుకు వెళ్లి నీటిలో పడిపోయింది. శనివారం ఉదయం గంగుబాయి మృతదేహం నీటిలో తేలింది. మృతురాలి కుమారుడు మోతె భోజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్టు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మహిళ..



మహిళ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీక్లీ మార్కెట్‌లోని కల్లుబట్టి వద్ద గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మృతురాలి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందన్నారు. మృతురాలి సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 59837 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మృతి చెందిన మహిళతోపాటు మరో వ్యక్తి కల్లుబట్టిలో మద్యం, కల్లు సేవించినట్లు అక్కడి వారు చెబుతున్నారు. మహిళ కింద పడిపోగానే సదరు వ్యక్తి అక్కడి నుంచి జారుకున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

స్కార్పియో బోల్తా

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట గ్రామ శివారులో సంగారెడ్డి – నాందెడ్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి స్కార్పియో బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి పిట్లం మండలానికి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.



వాహనంలో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

భిక్కనూరు: అప్పుల తీర్చే మార్గంలేక మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పెద్దమల్లారెడ్డికి చెందిన తాళ్లపల్లి నర్సయ్య (53) తన కుమారుడు, కుమార్తె పెళ్లికి అప్పులు చేశాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 17వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన 18 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 24న ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువతి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లోకి చొరబడి చైన్ స్నాచింగ్

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లోని ఓ ఇంట్లోకి చొరబడిన దుండగుడు మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

నర్సుబాయి(70) అనే మహిళ శనివారం తన ఇంట్లో ఉండగా, ఇంట్లోకి చొరబడిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లిలో శనివారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై సాయన్న చెప్పారు. పక్కా సమాచారం మేరకు పేకాటస్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.6,130 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ చోరీ.. ముగ్గురిపై కేసు

నిజామాబాద్‌రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఖానాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద పార్క్‌చేసి ఉన్న లారీని దుండగులు ఎత్తుకెళ్లారని రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని లలితానగర్‌కు చెందిన గోనె శ్రీనివాస్ తన లారీని ఈనెల 23వ తేదీన ఖానాపూర్ ఎక్స్ రోడ్డులో పార్క్ చేశాడు. మరుసటి రోజు తెల్లవారుజామున వెళ్లి చూసే సరికి లారీ కనిపించకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆర్మూర్‌ప్రాంతంలో లారీ ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొండ గొర్రెను వేటాడిన వ్యక్తిపై..

గాంధారి(ఎల్లారెడ్డి): కొండ గొర్రెను వేటాడిన వ్యక్తిపై అటవీచట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో హిమచందన శనివారం తెలిపారు. మండలంలోని రాంపూర్‌గడ్డ తండాకు చెందిన హన్మంతు రెండు రోజుల క్రితం ముదెల్లి అటవీ ప్రాంతంలో కొండగొర్రెను వేటాడి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి విక్రయించాడు. ఈ ఘటనపై కామారెడ్డి ఎఫ్‌డీవో రామకృష్ణ విచారణ చేపట్టి హన్మంతుపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. హన్మంతు పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుని రిమాండ్ చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు

- బైక్‌ను ఢీ కొట్టిన కారు



రాజానందం (ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారి 44పై బైక్‌ను కారు వెనుక నుంచి అతివేగంగా ఢీ కొట్టడంతో మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన రాజానందం(55) అక్కడిక్కడే మృతిచెందగా, అతడి భార్య సిద్ధవ్వకు గాయాలయ్యాయి. బాల్కొండ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రాజానందం తన భార్యతో కలిసి బైక్‌పై బాల్కొండ మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా దూసుకువచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజానందం తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన అతడి భార్య సిద్ధవ్వను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్‌లో శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రాకాసీపేట్‌లోని జీనత్ ఫంక్షన్ హాలులో పెళ్లి రిసెప్షన్ జరుగుతుండగా సాయికుమార్ అనే వ్యక్తి ఆహ్వానం లేకుండాని ఫంక్షన్ హాలులోకి వెళ్లి సెల్‌ఫోన్‌తో ఫొటోలు, వీడియో తీస్తుండగా అక్కడే క్యాటరింగ్ చేస్తున్న వ్యక్తి వారించాడు. దీంతో సాయికుమార్ గొడవకు దిగి తన చేతికి ఉన్న కడియంతో ఖలీల్ ముఖంపై కొట్టాడు. సమాచారం అందుకున్న పెట్రోలింగ్ పోలీసులు ఫంక్షన్ హాల్‌కు చేరుకొని సాయికుమార్‌ను సముదాయిస్తుండగా దురుసుగా వ్యవహరించి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. పంక్షన్ హాలులో గొడవ చేయడంతోపాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వేధింపులకు పాల్పడిన వారిపై..

ఎల్లారెడ్డి: పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన శ్యామల అనే మహిళను వేధిస్తున్న అత్తామామలపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. తన భర్త మృతి చెందడంతో అత్తామామలు వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు.

